క్లుప్తంగా

గంగానమ్మ తిరునాళ్ల ప్రారంభం



నున్న(విజయవాడరూరల్): బోడపాడు క్షేత్ర నివాసిని, భోగభాగ్య ప్రదాయిని శ్రీ గంగానమ్మ తిరునాళ్ల సోమవారం ప్రారంభమయ్యాయి. గణపతి పూజ, పుణ్యాహవాచన అఖండ దీపారాధన, కలశస్థాపన, అంకురార్పణ అనంతరం సువాసినీలు అమ్మవారికి పసుపుకొట్టే కార్యక్రమాన్ని మేళతాళాలతో ఆలయ ప్రాంగణంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పిమ్మట అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. తిరునాళ్లలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంకాలం సహస్రనామార్చన, చతుర్వేద పారాయణం చేశారు.

ఉపాధి పనుల్లో డొల్లతనం




పెనమలూరు: గోసాల గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టిన ఉపాధి పనుల్లో డొల్లతనం బయటపడింది. ఉపాధి పనుల్లో పూర్తి నిర్లక్ష్యం జరిగినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వివరాల్లోకి వెళితే గ్రామీణా ఉపాధి హామీ పథకం కింద గోసాలలో 1వ తూము వద్ద నుంచి ఈడుపుగల్లు పొలిమేర వరకు కాలువ తవ్వారు. దీనికి రూ 75,700 ఖర్చు పెట్టినట్లు రికార్డుల్లో చూపారు. వాస్తవానికి పంట కాలువను కేవలం 10 మీటర్ల మేరకు తవ్వి పూడిక తీసి మిగతా కాలువ వదిలేశారు. పంట కాలువను తవ్వకుండా అధికారులు రికార్డుల్లో నమోదు చేసి బోర్డు ఏర్పాటు చేయటంపై స్థానికులు అభ్యంతరం తెలుపుతున్నారు. మరలా వ్యవసాయ సీజన్ మొదలవుతుండగా పంట కాలువలో పిచ్చి మొక్కలతో అధ్వానంగా ఉంది. కాగా ఈ విషయమై సర్పంచి సంగెపు శ్రీనివాసరావు దృష్టికి తీసుకురాగా కాలువ వ్యవహారంపై తనకు ఫిర్యాదు అందిందని, మండల అధికారుల దృష్టికి తీసుకు వెళతానన్నారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణ మహోత్సవం



కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి శివారు శ్రీగణపతి సచ్చిదానందస్వామి ఆశ్రమంలోని శ్రీపంచతత్వ పాదుకా నిలయంలో సోమవారం శ్రీశ్రీనివాస కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. తొలుత ద్వారకా తిరుమల సుదర్శన శ్రీనివాసచార్యుల శిష్య బృందంచే పూజ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సముహూర్తంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకులతో పాటు విజయవాడ, గన్నవరం పరిసరా ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

అర్హులకు పింఛన్లు మంజూరు చేయండి



పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థలోని 64 డివిజన్లలో అర్హులకు వృద్ధాప్య, వితంతు, వికలాంగ, ఒంటరి మహిళ తదితర సంక్షేమ సామాజిక పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలని సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు విజ్ఞప్తి చేశారు. సోమవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) వద్ద అర్హులైన లబ్ధిదారులతో ఆయన ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు పూర్తవుతున్నా, సచివాలయంలో అర్హులైన పెన్షన్ లబ్ధిదారులు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించకపోవడం శోచనీయమని, ఇది సంక్షేమ ప్రభుత్వం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. పేద లబ్ధిదారుల అర్హతలను కూడా పరిగణలోకి తీసుకోకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. 2023 డిసెంబర్ నుంచి ఇప్పటివరకు పెన్షన్ తీసుకుంటూ మరణించిన లబ్ధిదారుని భార్యకు మాత్రమే పింఛన్ ఇస్తామని ఉత్తర్వులు జారీ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అర్హులకు పెన్షన్లు మంజూరు చేయకపోతే సచివాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో అర్హులైన పెన్షన్ లబ్ధిదారులతో ఆందోళన, పోరాటం చేస్తామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్‌సిక్స్ అమలు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారని, ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు పూర్తయినా ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా కాలయాపన చేయడం రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రమాదపు అంచున ప్రయాణం

- ధ్వంసమైన మద్దూరు – గోసాల రోడ్డు
- ఎక్కడ చూసినా ఇసుక గుట్టలే
- జాతీయ రహదారి మార్జిన్‌లోనూ పేరుకుపోతున్న ఇసుక
- అధిక లోడు వాహనాలతోనే సమస్య
- పట్టించుకోని అధికారులు



ఇసుక గుట్టలు పేరుకుపోయిన మద్దూరు - గోసాల రోడ్డు



విజయవాడ-మచిలీపట్నం హైవే మార్జిన్ దుస్థితి

కంకిపాడు: అసలే రోడ్డు అధ్వానం.. ఆపై పేరుకుపోయిన ఇసుక మేటలు...వెరసి వాహనదారులు బిక్కుబిక్కు మంటూ ప్రమాదం అంచున ప్రయాణం సాగిస్తున్నారు. కరకట్ట నుంచి జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న మద్దూరు – గోసాల రోడ్డుతో పాటు జాతీయ రహదారి మార్జిన్‌లు సైతం ఇసుకతో మేట పేరుకుపోయి వాహనదారులు ప్రమాదాల బారిపడుతున్నారు. అధిక లోడుతో వెళ్తున్న ఇసుక లారీలు, ట్రాక్టర్లు కారణంగా ఇసుక జారిపడి ప్రమాదాలకు కారణంగా మారుతుంది. అయినా అధికారులు నియంత్రణ చర్యలు తీసుకోకపోవటం విమర్శలకు తావిస్తోంది.

రోడ్డు ధ్వంసం.. మేట వేసుకున్న ఇసుక..

కృష్ణా కరకట్ట నుంచి మద్దూరు, వణుకూరు, గోసాల గ్రామాల మీదుగా విజయవాడ – మచిలీపట్నం జాతీయ రహదారి చేరుకునేందుకు ఆరు కిలో మీటర్లు మేర ఆర్అండ్‌బీ రహదారి ఉంది. కరకట్ట వెంబడి ఏ రీచ్‌లో ఇసుక తవ్వకాలు జరిగినా ట్రాక్టర్లు, లారీలు ప్రధానంగా ఈ మార్గంగుండానే రాకపోకలు సాగిస్తున్నారు. పదేళ్లకు పైగా ఈ రోడ్డుకు మోక్షం లేదు. మార్జిన్‌లు కోతకు గురై, పెద్ద గోతులు ఏర్పడి ప్రయాణం నరకప్రాయంగా మారింది. దీనికి తోడు భారీ లోడుతో వెళ్లే ఇసుక లారీలు, ట్రాక్టర్లు కారణంగా రోడ్డు పూర్తిగా ధ్వంసమై రాకపోకలకు సైతం వాహనదారులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి. పరిమితికి మించి లారీలు, ట్రాక్టర్లలో ఇసుక లోడు చేసి రవాణా సాగిస్తున్నారు. అసలే అధ్వానంగా, గోతుల పడ్డ రోడ్డు మార్గంలో భారీ లోడుతో వెళ్తున్న వాహనాల నుంచి ఇసుక గుట్టలుగా జారిపడిపోతుంది. రోడ్డు మార్గంలో ఎక్కడ చూసినా మేట వేసుకుని రాకపోకలకు అసౌకర్యంగా మారింది. రాత్రిళ్లు ఇసుక గుట్టలు కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్న ఘటనలు నిత్యకృత్యంగా మారాయి.

జాతీయ రహదారిపైనా అదే దుస్థితి..

కరకట్ట వెంబడి చేపడుతున్న ఇసుక రవాణా వాహనాలు విజయవాడ – మచిలీపట్నం జాతీయ రహదారి గుండా రాకపోకలు సాగిస్తున్నాయి. జాతీయ రహదారిపైనా ఇదే పరిస్థితి నెలకొంది. ఎక్కడ చూసినా మార్జిన్‌లు ఇసుకతో నిండిపోయి ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. మార్జిన్‌కు వెళ్లిన ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కనీసం స్థానిక సంస్థలు సైతం ప్రధాన రహదారులు, అనుబంధ రహదారుల్లో పేరుకున్న ఇసుక తొలగించే పరిస్థితి లేదు. అధికారుల నిర్లక్ష్యం, సమన్వయలోపం కారణంగా ప్రజలు ప్రమాదం అంచున ప్రయాణాలు సాగిస్తున్నారు.

పట్టించుకునేవారేరీ ?

నిబంధనలకు విరుద్ధంగా ఇసుక లోడుతో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇసుక జారిపడి, మేట వేసుకుని ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇంత ప్రమాదకర స్థితి నెలకొన్నా రెవెన్యూ, పోలీసు, రవాణాశాఖ, మైనింగ్ అధికారులు పట్టించుకోవటం లేదు. అధిక లోడుతో రవాణా సాగించే వాహనాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవటం లేదు. దీంతో అడ్డగోలుగా ఇసుక రవాణా సాగిపోతుండగా, ప్రమాదాలతో భయంభయంతో ప్రజలు రాకపోకలు సాగించాల్సి వస్తోంది.

ఆర్టీసీ ఉద్యోగుల రిలే దీక్షలు ప్రారంభం



నిరాహార దీక్షను ప్రారంభిస్తున్న నాగిరెడ్డి తదితరులు



డిపో ఆవరణలో దీక్షలో పాల్గొన్న ఎన్ఎంయూఏ ప్రతినిధులు

గన్నవరం: ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ఆర్టీసీ యాజమాన్యం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా స్థానిక బస్టాండ్ వద్ద ఏపీపీటీడీ ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో సోమవారం రిలే నిరహార దీక్షలు ప్రారంభించారు. తొలుత దీక్ష శిబిరాన్ని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. అయినప్పటికీ సమస్యల పరిష్కరించకుండా నాలుగు నెలలుగా యాజమాన్యం కాలయాపన చేస్తోందన్నారు. మేనేజ్‌మెంట్ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఎన్ఎంయూఏ ఇప్పటికే అంచలంచెలుగా ఉద్యమ కార్యచరణ చేపట్టినట్లు తెలిపారు. దీనిలో భాగంగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రెండు రోజుల పాటు రిలే నిరహార దీక్షలు నిర్వహించనున్నామన్నారు. ఇప్పటికై న యాజమాన్యం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ముందుకు రాకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని నాగిరెడ్డి హెచ్చరించారు. దీక్షలో అసోసియేషన్ డిపో అధ్యక్షుడు ఏఎస్.రావు నేతృత్వంలో ఉద్యోగులు పీఆర్ రావు, పి.పరుశురామ్, ఏ బషీర్, కేఆర్ కృష్ణ, బీఈ కొండలు, వై బాబు, కేవీ రామారావు, కేఆర్ కుమార్ పాల్గొన్నారు.

ఉయ్యూరు డిపో ఆవరణలో..

ఉయ్యూరు: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎన్ఎంయూఏ ఉయ్యూరు డిపో కార్యదర్శి పీఎం కృష్ణ అన్నారు. ఎన్ఎంయూఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆర్టీసీలో ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు, సంక్షేమం, భద్రతా అంశాల పరిష్కారం కోరుతూ సోమవారం ఉయ్యూరు డిపో ఆవరణలో రిలే దీక్షలు చేపట్టారు. దీక్షలను డిపో కార్యదర్శి కృష్ణ ప్రారంభించారు. దీక్షలో సీహెచ్ పిచ్చియ్య, ఎన్.పాండవులు, ఎల్ఎస్ రావు, సుబ్బారావు, రాజేష్‌కుమార్, సారథి కూర్చున్నారు. శిబిరంలో ఉద్యోగులు అరుణోదయ, జయలక్ష్మి, అన్నామణి, శివప్రసాద్, దావీదు, బీఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభం



గన్నవరం గ్రంథాలయంలో మాట్లాడుతున్న నర్రా సీతారామారావు



పురుషోత్తపట్నంలో అయ్యంకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు



పెనమలూరు శిబిరంలో విద్యార్థులు

గన్నవరం: గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల వ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు సోమవారం ప్రారంభమయ్యాయి. శిక్షణ తరగతులకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. దీంతో గ్రంథాలయాల్లో విద్యార్థులతో కోలాహలం నెలకొంది. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నర్రా సీతారామారావు జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లల్లో పఠనాభిలాషను, సృజనాత్మక శక్తిని పెంపొందించేందుకు విజ్ఞాన శిబిరం దోహదపడుతుందన్నారు. ప్రతి రోజు పిల్లలకు కథలు చదివి వినిపించడం, పుస్తక పఠనం, స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, పేపర్ క్రాఫ్ట్స్, పెయింటింగ్‌లో శిక్షణ ఇస్తారని చెప్పారు. విశ్రాంత అధ్యాపకులు గన్నె వెంకట్రావు, కమిటీ సభ్యులు చిమట రామారావు, ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి పి.దుర్గాలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

పురుషోత్తపట్నంలో..

పురుషోత్తపట్నంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటరామయ్య ప్రారంభించారు. అనంతరం గ్రంథాలయోద్యమకారుడు అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి విద్యార్థులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నెల రోజుల పాటు జరిగే విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గుమ్మడి సూచించారు. ఎంపీయూపీ స్కూల్ హెచ్ఎం సుమిత్రా, గ్రంథాలయాధికారి కె.కృపానందం, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెనమలూరు గ్రంథాలయంలో

పెనమలూరు: పెనమలూరు గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించామని గ్రంథాలయ అధికారి పి.హరీష తెలిపారు. ఆమె వివరాలు తెలుపుతూ వేసవి శిక్షణ శిబిరం జూన్ 6వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. మొదటి రోజు విద్యార్థులతో న్యూస్ పేపర్ చదివించటం, కథలు చెప్పటం, ఆటలు ఆడించామని చెప్పారు.

ఉయ్యూరులో ప్రారంభం

ఉయ్యూరు: వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని 14వ వార్డు కౌన్సిలర్ కూరాడ వెంకట లక్ష్మి కోరారు. ఉయ్యూరు గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులను సోమవారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ పాఠశాల హెచ్ఎం పి.శ్రీనివాసరావు, సిద్ధార్థ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సాంబశివరావు, బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి కృష్ణ ప్రసాద్ పాల్గొని వేసవి శిక్షణ తరగతుల ఆవశ్యకతను వివరించారు. గ్రంథాలయాధికారి బి.రమణి, సిబ్బంది ప్రవంతి, సోని పర్యవేక్షించారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

కంకిపాడు: గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని వక్తలు సూచించారు. తెన్నేరు శాఖా గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన శిక్షణ శిబిరాలను గ్రామ పెద్దలు దేవినేని చంద్రశేఖర్, ఎర్ర చిన్నయ్య, మధుసూదన్, లక్ష్మి ప్రారంభించారు. గ్రంథాలయాల ద్వారా లభించే ప్రయోజనాలను తెలుసుకోవాలని సూచించారు. తొలి రోజు చిత్రలేఖనంలో శిక్షణ అందించారు. శిక్షణ శిబిరాలను గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు. కంకిపాడు శాఖ గ్రంథాలయంలో సోమవారం నుంచి వేసవి శిక్షణా శిబిరాలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు 30 మంది విద్యార్థులు కథలు చదవటం, కథలు వినిపించటంలో శిక్షణ పొందారు. క్యారమ్స్, క్రాఫ్ట్‌వర్క్‌లో శిక్షణ పొందారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ, టి.శేషుబాబు, అప్పారావు, మాధవీలత పాల్గొన్నారు.



ఉయ్యూరు గ్రంథాలయంలో..



తెన్నేరు గ్రంథాలయంలో..



కంకిపాడులో క్యారమ్స్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

నగదు తీసుకొని మోసగించిన వ్యక్తిపై కేసు నమోదు

పెనమలూరు: మిత్రులను నమ్మించి నగదు తీసుకొని పారిపోయిన వ్యక్తిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం కానూరుకు చెందిన పోలాబత్తిన ఆనంద్‌బాబు పటమట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద శోభన్ ఎంటర్‌ప్రైజెస్‌లో పని చేస్తాడు. అతనితో పాటు ఉయ్యూరు పవన్‌కుమార్, పలగాని వికాస్‌బాబు, ఎం.ఉదయ్‌తేజ పని చేస్తారు. కాగా మహాలక్ష్మి గ్యాస్ ఏజెన్సీలో మేనేజర్‌గా పని చేస్తున్న ఎం.గణేష్‌కుమార్ పైన పేర్కొన్న వ్యక్తులు మిత్రులు. తరచుగా పటమట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్దకు వచ్చి ఆనంద్‌బాబుకు, ఇతర మిత్రులు పనిలో సహాయపడుతూ ఉండే వారు. కాగా ఉయ్యూరు పవన్‌కుమార్ ఇటీవల గణేష్‌కుమార్‌కు రూ.12.45 లక్షలు చేబదులుగా ఇచ్చాడు.

ఇది ఇలా ఉండగా గత నెల 26న గణేష్‌కుమార్ బస్‌స్టాండ్‌కు వెళ్లి వస్తానని ఆనంద్‌బాబు బైక్ తీసుకువెళ్లాడు. ఆ తరువాత అతను తిరిగి రాలేదు. బైక్‌లో రిజిస్ట్రేషన్‌కు చెల్లించాల్సిన సొమ్ము రూ.2.80 లక్షలు ఆనంద్‌బాబు ఉంచాడు. గణేష్‌కుమార్‌కు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తుంది. ఈ విషయమై గణేష్‌కుమార్ చేసిన మోసాలను తండ్రి సుబ్బారావుకు చెప్పగా అతను పరిష్కరిస్తానని ఆ తరువాత అతను మొఖం చాటేశాడు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం

పటమట(విజయవాడతూర్పు): నగరంలో ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. సోమవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో ఆయన ప్రజా ఫిర్యాదులు–పరిష్కార కార్యక్రమంలో నగరవాసుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను వేగంగా, సమర్థంగా పరిష్కరించడం నగరపాలక సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఫిర్యాదులపై వెంటనే స్పందించడంతో పాటు, వాటికి శాశ్వత పరిష్కారం కనుగొనడంపై అధికారులకు సూచనలు ఇచ్చారు. 17 ఫిర్యాదులు అందగా అందులో పట్టణ ప్రణాళిక సంబంధించినవి 4, ఇంజినీరింగ్ 3 , రెవెన్యూ- 2, వైద్య, ఆరోగ్యం 2, ఉద్యానవనం 1, ఎస్టేట్ 1, పీఓ యూసీడీ సంబంధించినవి 3, హౌసింగ్ 1 మొత్తం కలిపి 17 ఫిర్యాదులను అందుకున్నారు. అదనపు కమిషనర్ ప్రాజెక్ట్స్ డాక్టర్ డి. చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజినీర్ ఆర్ శ్రీనాథ్‌రెడ్డి, డెప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి.సృజన, సూపరింటెండెంట్ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

ఉయ్యూరురూరల్: ఎస్సీ కార్పొరేషన్ ఆర్థిక రుణాలను యువత సద్వినియోగం చేసుకోవాలని ఉయ్యూరు ఎంపీడీవో జీఎస్‌వీ శేషగిరిరావు కోరారు. 2025- 26 సంవత్సరానికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పలు రకాల యూనిట్లను యువతకు అందించేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారన్నారు. యువతకు ఆర్థిక చేయూత అందించేందుకు బ్యాంకర్ల ద్వారా ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేసేందుకు మార్గదర్శకాలు విడుదల చేశారని తెలిపారు. దీని ప్రకారం ఏప్రిల్ 11 నుంచి మే 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి గల యువత మెడికల్ షాపులు, మెడికల్ ల్యాబ్, ఎలక్ట్రిక్ బ్యాటరీ చార్జింగ్ యూనిట్ ఎలక్ట్రిక్ ఆటో, ప్యాసింజర్ ఆటో, కార్ (ఫోర్ వీలర్), గూడ్స్ ట్రక్ లాంటి యూనిట్లకు అవకాశం కల్పిస్తామని చెప్పారు.

కార్మిక హక్కులు కాలరాస్తున్న పాలకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు, డివిజన్ పార్టీ ఇన్‌చార్జి బుద్దె రాజా అన్నారు. మే ఒకటో తేదీన కార్మిక దినోత్సవాన్ని 40,41,42 డివిజన్లలో ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. సోమవారం భవానీపురంలోని 40వ డివిజన్ సీపీఐ కార్యాలయం అమర్‌భవన్‌లో బ్రాంచి కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

కౌలురైతుల సమస్యలపై 12న ధర్నా



మాట్లాడుతున్న పంచకర్ల రంగారావు

గన్నవరం: కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలని కోరుతూ మే 12న రెవెన్యూ కార్యాలయాలు వద్ద చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ కౌలుదార్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంచకర్ల రంగారావు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం కౌలుదార్ల సంఘం మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం సాగుదారుల్లో 90 శాతం మంది కౌలుదారులేనని చెప్పారు. అటువంటి కౌలుదారుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వానికి నిర్లక్ష్య వైఖరి తగదన్నారు. అందరికీ కౌలు కార్డులు ఇవ్వకపోవడం వల్ల పండించిన పంటలను విక్రయించుకోలేక, వరదల సమయంలో పంట నష్టపరిహారం పొందలేని దుస్థితిలో ఉన్నారని చెప్పారు. ఇప్పటికై నా ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ కౌలుకార్డులు అందజేసి అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు చేపట్టనున్న ధర్నా కార్యక్రమాల్లో కౌలుదారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు టీవీ లక్ష్మణస్వామి, నాయకులు కైలే ఏసుదాసు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆధునిక పరిజ్ఞానంతో ఎదగాలి



విద్యార్థులకు పరికరాలు అందజేస్తున్న దాత నాగశ్రవణ్

పెనమలూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఆధునిక పరిజ్ఞానంతో ఉన్నతంగా ఎదగాలని విజయవాడ సీడ్స్ యు సమన్వయకర్త, పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కిలారు నాగశ్రవణ్ అన్నారు. పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు అటల్ టింకరింగ్ ల్యాబ్ సమ్మర్ బూట్ క్యాంపులో భాగంగా విద్యార్థులు విజ్ఞానిక పరికరాలు పంపిణీ చేసి ప్రసంగించారు. సమ్మర్ క్యాంపులో సాంకేతిక పరిశోధనలపై ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకొని శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. విద్యార్థులకు అవసరమైన సైన్స్ పరికరాలు ఉచితంగా తాను అందచేస్తానని హామీ ఇచ్చారు. శిక్షణ తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత భోజన వసతి కల్పిస్తామన్నారు. ప్రధానోపాధ్యాయురాలు వై.దుర్గాభవాని, డీవైఈఓ ఐ.పద్మారాణి, ఎంఈఓ కనకమహాలక్ష్మి, యూనిసెఫ్ ప్రతినిధులు టి.సుదర్శన్, డి.మాధవిలత, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కిలారు శివకుమార్, కార్యదర్శి కిలారు సత్యనారాయణ, డీఎస్ఓ మహమ్మద్ జాకీర్‌అహ్మద్, అటల్ స్టేట్ కో ఆర్డినేటర్ డీవీ సుబ్బారావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఖైరంబి, టెక్నికల్ సపోర్టర్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏజీ అండ్ ఎస్జీ కళాశాలలో రేపు జాబ్‌మేళా



జాబ్ మేళా పోస్టల్ ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ శేషగిరిరావు తదితరులు

ఉయ్యూరురూరల్: ఉయ్యూరు రూరల్ నైపుణ్యాల అభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఏజీ అండ్ ఎస్జీ సిద్ధార్థ కళాశాలలో బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉయ్యూరు రూరల్ ఎంపీడీఓ జీఎస్‌వీ శేషగిరిరావు సోమవారం తెలిపారు. జాబ్‌మేళాలో ఎంఎస్ఎన్ ల్యాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఎన్ఎస్ ఇన్స్ట్రూమెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఫ్రింగిల్ ఐటీ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్, కురాకు ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, ఎంఆర్ఎఫ్ లిమిటెడ్, సుధీర్ టింబర్స్ ప్రైవేట్ లిమిటెడ్, ముత్తూట్ మనీ లిమిటెడ్, భారత్ ఫైనాన్సియల్ ఇంక్లూజన్ లిమిటెడ్, మెడ్ప్లస్ హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, పేటీఎం, శివ్ పార్వతి ఎంటర్‌ప్రైజెస్ వంటి ప్రముఖ కంపెనీల వారు పాల్గొంటాయని ఉపాధి అధికారి డిజిగ్నేటెడ్ ఆఫీసర్ డి.విక్టర్ బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.నరేష్ కుమార్ తెలిపారు. ఈ కంపెనీల్లో ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బి.ఫార్మసి, పీజీ పూర్తిచేసిన 18 నుంచి 30 సంవత్సరాల లోపు యువత అర్హులన్నారు. ఆసక్తి, అర్హతలు గల అభ్యర్థులు ముందుగా httpr://naipunyam.ap.gov.in/urer&refirtration లింక్ నందు వివరాలు నమోదు చేయాలన్నారు. పూర్తి వివరాలకు 96187 13243, 88851 59008, 79813 68429 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జి టి.మధు, స్కిల్ డెవలప్‌మెంట్ ఏరియా కోఆర్డినేటర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సురక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులో సురక్షిత తాగునీరు సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు అన్నారు. రామవరప్పాడులో వాటర్ పైప్‌లైన్‌ను పరిశీలించి సోమవారం సిబ్బందితో మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ.. గ్రామంలో 4 వాటర్ ట్యాంక్‌లు, 4 మోటారు బోర్ల సహాయంతో తాగునీటిని అందిస్తున్నామన్నారు. తాగునీటి సరఫరాలో కాల్వగట్టు ప్రాంతాల్లో ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నామని, వాటర్ పైప్‌లైన్ లీక్‌లు గుర్తించి మరమ్మతులు చేపడుతున్నామన్నారు. పంచాయతీ ఆధ్వర్యంలో తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురైతే నేరుగా పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.